

సోమశిలలో 13.853 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం సాయంత్రానికి 13.853 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 10,129 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు) రూ.70,960
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)రూ.6,355
3శాతం జీఎస్టీతో రూ.6,546
నవర (8గ్రా) రూ.52,368

గరిష్టం/కనిష్టం
35.2 /27.6

వాతావరణం

గాలిలో తేమ 64 శాతంగా గురువారం నమోదైంది. జిల్లాలో వాతావరణం శుక్రవారం తేమగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

డీసీపల్లిలో 675 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో గురువారం 675 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 798 బేళ్లు రాగా వాటిలో 675 బేళ్లను విక్రయించామని అన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 85,505 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,35,49,225 వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.358 కాగా కనిష్ట ధర రూ.205 లభించింది.

జెడ్పీ సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు తప్పక హాజరుకావాలని కోరారు.

సచివాలయ అద్దాలు ధ్వంసం



సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని అమనిచిరువెళ్ల గ్రామ శివారులోని సచివాలయ భవనానికి ఉన్న అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ పని మందుబాబులు చేశారా లేక టీడీపీ నాయకులు చేశారా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ నేడు జిల్లాకు రాక

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ (ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్) కె సంతోషరావు శుక్రవారం నెల్లూరుకు రానున్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయ భవనంలో విద్యుత్ శాఖ ఈఈలు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ గురువారం తెలియచేశారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో తమ్ముళ్ల మధ్య వివాదం



ఇరువర్గాలకు సర్దిచెబుతున్న పోలీసు

సోమశిల: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో సోమశిల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో టీడీపీకి చెందిన ఇరువర్గాలు పోటీ పడ్డాయి. ఒకరికి మెజారిటీ రావడంతో రెండో వర్గం వాగ్వాదానికి దిగడంతో తోపులాట జరిగింది. దీనిపై పాఠశాల యాజమాన్యం సోమశిల ఎస్సై సుబ్బారావుకు సమాచారం అందించడంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ఘర్షణను సద్దుమణిగేలా చేశారు. మండలంలో మిగిలిన పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖాధికారులు తెలిపారు.

డీఎంహెచ్ఓ సంతకం ఫోర్జరీతో మోసాలు

• కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సంతకం ఫోర్జరీ చేసి నకిలీ అపాయింట్‌మెంట్లు ఇచ్చిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతి జిల్లాకు చెందిన కరిముల్లా నెల్లూరు జిల్లా వైద్యారోగ్యశాఖ ఉద్యోగులతో పరిచయాలున్నాయని, కాంట్రాక్టు ప్రాతిపదికన స్టాఫ్‌నర్సు ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువుర్ని నమ్మించాడు. జిల్లాకు చెందిన ఏడుగురు వ్యక్తుల వద్ద సుమారు రూ.14లక్షలు వసూలు చేశాడు. డీఎంఅండ్‌హెచ్‌ఓ పేరుతో ఉన్న అపాయింట్‌మెంట్ లెటర్ వారికి ఇచ్చాడు. ఈ క్రమంలో వెంకటకృష్ణ అపాయింట్‌మెంట్ లెటర్ తీసుకుని డీఎంఅండ్‌హెచ్‌ఓ పెంచలయ్యను కలవగా అందులో ఉన్న సంతకం తనదికాదని, ఎవరో ఫోర్జరీ చేశారని గుర్తించారు. బుధవారం రాత్రి ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆయాల ఆకలి కేకలు



దర్గామిట్ట జెడ్పీ ఉన్నత పాఠశాలలో టాయిలెట్స్‌ను శుభ్రం చేస్తున్న ఆయా

4 నెలలుగా అందని వేతనాలు

కూటమి ప్రభుత్వం చిరుద్యోగులను చిన్నచూపు చూస్తోంది. పని చేస్తేనే కుటుంబ పోషణ జరిగే పరిస్థితి వారిది. ఒక్క నెల వేతనం ఆగినా కుటుంబం మొత్తం పస్తులు ఉండాల్సిన పరిస్థితి. నాలుగు నెలలుగా వేతనం అందకపోతే వారి పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. జిల్లాలోని పాఠశాలలను శుభ్రం చేస్తున్న ఆయాల పరిస్థితి ఇది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ఆయాలకు వేతనాలను నిలిపివేశారు. వాటిని ఎప్పుడిస్తారా అని ఆయాలు ఎదురు చూస్తున్నారు. కుటుంబ పోషణకు అప్పు చేసి పోషించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఎప్పుడిస్తారో స్పష్టత కరువు
- భారంగా కుటుంబ పోషణ
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 2,592 పాఠశాలలు
- ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న 2,734 మంది ఆయాలు
- ఒక్కో ఆయాకు నెలకు రూ.6 వేలు వేతనం

గత ప్రభుత్వంలో నెలనెలా ఠంచన్‌గా అందజేత

నెల్లూరు (టౌన్): పాఠశాలల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో ఆయాలను నియమించింది. రెండు పూటలా పాఠశాలలను, మరుగుదొడ్లను శుభ్రం చేసి, మధ్యాహ్న భోజనం అనంతరం వ్యర్థాలను తొలగిస్తుంటారు. పాఠశాలల్లో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలకు నీరు పోస్తూ వాటి సంరక్షణకు పాటు పడుతుంటారు. జిల్లాలో 2,592 పాఠశాలల్లో 1,81,392 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో 300 మంది విద్యార్థులుంటే ఒక ఆయా, 600 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఇద్దరు ఆయాలు, 600 నుంచి 900 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ముగ్గురు ఆయాలు, 900 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలకు నలుగురు లెక్కన ఆయాలను నియమించారు.

ఒక్కో ఆయాకు రూ.6 వేల వేతనం

పాఠశాలలతో పాటు పరిసరాలను శుభ్రం చేసేందుకు ప్రభుత్వం ఆయాలను నియమించింది. జిల్లాలో మొత్తం 2,592 పాఠశాలల్లో 2,734 మంది ఆయాలు పనిచేస్తున్నారు. ఒక్కో ఆయాకు నెలకు రూ.6 వేల వేతనం గత ప్రభుత్వం అందజేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద ఏడాది రూ.15 వేల నగదును అకౌంట్లలో జమ చేసేది. ఇందులో స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ కింద రూ.2 వేలను వినియోగించేవారు. ఆ డబ్బుల్లోనే ఆయాలకు వేతనాలతో పాటు మరుగుదొడ్ల పరిశుభ్రతకు ఉపయోగించే వస్తువులు, ద్రావణాలకు ఖర్చు చేసేది. గత ప్రభుత్వంలో ఆయాలకు ప్రతి నెల వేతనాన్ని అందజేసేది. ఈ ఏడాది మార్చి వరకు ఆయాలకు వేతనం రెగ్యులర్‌గా అందింది.

కుటుంబ పోషణ భారంగా ఉంది



కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. మాకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించాలి. ఆ జీతంతోనే కుటుంబాన్ని పోషించాల్సి ఉంది. జీతాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే తమకు తెలియదని స్కూల్ హెడ్‌మాస్టర్ చెబుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మాకు రావాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలి.

– రాజేశ్వరి, ఆయా, నెల్లూరు

గతంలో సమయానికి జీతాలిచ్చేవారు



మాకు రావాల్సిన జీతాలను చెల్లించక పోవడంతో ఇబ్బందిగా ఉంది. వాటిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. గతంలో ప్రతి నెల సమయానికి జీతాలు చెల్లించే వారు. పాఠశాలలోనే ఉదయం నుంచి సాయంత్రం దాక ఉంటున్నాం. మరో పని చేసుకునేందుకు వీలుండదు. జిల్లా అధికారులు పట్టించుకుని మాకు వెంటనే జీతాలు చెల్లించాలి.

– రహంతున్నీసా, ఆయా, నెల్లూరు

ఏప్రిల్ నుంచి ఇవ్వడం లేదు



దర్గామిట్ట జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్లాస్ రూమ్స్ బయట శుభ్రం చేస్తున్న ఆయా

పాఠశాలల్లో పనిచేసే ఆయాలకు నాలుగు నెలలుగా వేతనం అందడం లేదు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన ఏప్రిల్ నుంచి వారికి వేతనాలను నిలిపివేశారు. ఇప్పటి వరకు వీరికి వేతనాలు ఇవ్వలేదు. పాఠశాలలు తెరిచి రెండు నెలలు దాటింది. వీరంతా విధుల్లోనే ఉన్నారు. అయితే వీరిని కొనసాగిస్తారా? లేక తొలగిస్తారా? అనేది కూడా స్పష్టత లేదు. ఈ ప్రభుత్వం ఇంత వరకు తల్లికి వందనం ఇచ్చే విషయంలో కూడా నిర్ణయం తీసుకోలేదు. అందరి నుంచి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత విధానాలను రూపొందిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో మాదిరిగానే ప్రతి విద్యార్థి నుంచి రూ.2 వేలు మినహాయించుకుని ఆయాలకు వేతనాలు ఇస్తారా? లేక వీరికి ప్రత్యేక నిధి ద్వారా వేతనాలిస్తారా? అనే విషయంపై విద్యాశాఖాధికారులకే స్పష్టత లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, ఉపాధ్యాయుల్లో అయోమయం నెలకొంది. జీతాలను నిలిపివేయడంతో ఆయాలు పాఠశాలలకు రాకుండా మానేస్తే పరిస్థితి ఏమిటని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇక పాఠశాలల్లో మరుగుదొడ్లు కంపు కొట్టడం ఖాయమంటున్నారు.

జిల్లాలో డీఎస్పీ, సీఐల బదిలీలు

నెల్లూరు (క్రైమ్): రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అందులో భాగంగా జిల్లాలోని ఆత్మకూరు డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.కోటారెడ్డి పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కె.వేణుగోపాల్‌ను నియమించారు.

పలువురు సీఐలు

గుంటూరు రేంజ్ పరిధిలో 30 మంది సీఐలను బదిలీచేస్తూ గురువారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. అందులో భాగంగా జిల్లాలోనూ పలువురు సీఐలు బదిలీ అయ్యారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
ఎస్‌కె నఫీజ్ బాషా	కందుకూరు సర్కిల్	మాచర్ల రూరల్, పల్నాడు జిల్లా
కేశవ వెంకటేశ్వరరావు	పీసీఆర్, ప్రకాశం జిల్లా	కందుకూరు సర్కిల్
జి.మంగారావు	పెద్దకూరపాడు సర్కిల్, పల్నాడు	గుడ్లూరు సర్కిల్
బి.వీరవెంకటసుబ్బారావు	గుడ్లూరు సర్కిల్	రేంజ్ కార్యాలయం
టి.వి.శ్రీనివాసరావు	కోవూరు సర్కిల్	కారంపుడి సర్కిల్, పల్నాడు జిల్లా
ఆర్.అహ్మద్‌జాని	డిఎస్‌బి-2	బాపట్ల టౌన్ పిఎస్
షేక్ అన్వర్‌బాషా	కొత్తపేట పీఎస్, గుంటూరు	నవాబుపేట పోలీసుస్టేషన్
ఎం.బాబి	నవాబుపేట పోలీసుస్టేషన్	నాయుడుపేట అర్బన్ పీఎస్, తిరుపతి జిల్లా
ఎం.రోశయ్య	సౌత్‌ట్రాఫిక్ పీఎస్	దర్గామిట్ట
ఖాజా అల్తాఫ్‌హుస్సేన్	దర్గామిట్ట పీఎస్	రేంజ్ కార్యాలయం
హెచ్ఎస్ హుస్సేన్‌బాషా	సోషల్‌మీడియా అండ్ సైబర్‌సెల్	వాకాడు సర్కిల్, తిరుపతి
కె.వేమారెడ్డి	మహిళా పీఎస్-1 గుంటూరు	సంగం సర్కిల్
రవినాయక్	సంగం సర్కిల్	రేంజ్ కార్యాలయం
జి.గంగాధర్‌రావు	రేంజ్ విఆర్	ఆత్మకూరు సర్కిల్
జి.వేణు	ఆత్మకూరు సర్కిల్	రేంజ్ కార్యాలయం
ఎం.డి.ఫిరోజ్	కలిగిరి సర్కిల్	కావలి ఒకటోపట్టణ పీఎస్
రాజేష్	కావలి ఒకటో పట్టణ పీఎస్	రేంజ్ కార్యాలయం





నందిపాడులో బాధితులను పరామర్శిస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, కొత్తపేటకు చెందిన తిరుపాల్‌నాయుడుకు చెక్కు అందిస్తున్న దృశ్యం

పోలీసులు టీడీపీకి కొమ్ము కాస్తున్నారు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి
- కార్యకర్త మండ్ల వెంకటేశ్వర్లు కుటుంబానికి పరామర్శ

దుత్తలూరు: పోలీసులు ఏకపక్షంగా టీడీపీ నేతలకు కొమ్ము కాయడం సరికాదని ఎమ్మెల్సీ, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఇటీవల నందిపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మండ్ల వెంకటేశ్వర్లుకు చెందిన ఆస్తులను టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి బాధిత కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడు వెంకటేశ్వర్లు 2021లో అగ్రిమెంటు చేసుకొని భూమిని కొనుగోలు చేశాడన్నారు. అంతేకాక కోర్టు ద్వారా తనకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ కూడా పొందివున్నాడన్నారు. అయితే టీడీపీ నాయకుల అండదండలతో ఇంట్లోవున్న వారిని బయటకు లాగి ఆస్తులు కూల్చివేయడం దుర్మార్గమన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకెళ్లి బాధితుడు వెంకటేశ్వర్లుకు పూర్తిస్థాయి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మారిన తర్వాత రాష్ట్రంలో దౌర్భాగ్య పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విషసంస్కృతికి టీడీపీ బీజం వేసిందన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుందని, ఇప్పుడు జరిగే పరిణామాలకు ఖచ్చితంగా వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి, వింజమూరు జడ్పీటీసీలు మోడి రామాంజనేయులు, గణపం బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు మండ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి రూ.50 వేలు ఆర్థిక సాయం

ఇటీవల మండలంలోని కొత్తపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగోతు తిరుపాల్‌నాయుడుకు చెందిన దుకాణాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. ఈ విషయం అధిష్టానం దృష్టికి వెళ్లగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.50 వేలు చెక్కును మంజూరు చేయగా గురువారం ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి చేతులమీదుగా బాధితునికి చెక్కు అందజేశారు.

క్వార్ట్జ్ మైనింగ్‌కు రంగం సిద్ధం!

- చెంతనే రెండు ప్రభుత్వ లేఅవుట్లు
- గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోని అధికారులు
- పోలీస్ బందోబస్తుతో ఏకపక్షంగా ప్రజాభిప్రాయ సేకరణ
- పశువులకు మేతపొరంబోకు ఉండదని రైతుల ఆవేదన



సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల తర్వాత మైనింగ్ అనుమతులకు రంగం సిద్ధమవుతోంది. స్థానికులు వ్యతిరేకిస్తున్నా ఖాతరు చేయకుండా మైనింగ్ నిర్వహణకు అడ్డంకులను బలవంతంగా టీడీపీ నేతలు తొలగించుకుంటున్నారు. నెలన్నర క్రితం పర్యావరణ శాఖ అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా మారిన విషయం తెలిసిందే. మళ్లీ అదే మైనింగ్ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ పోలీసు బందోబస్తు మధ్య ఎలాంటి అడ్డంకులు లేకుండా జరిగిపోవడంపై పర్యావరణ హితులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, చుట్టుపక్కల గ్రామాల వారు విస్తుపోతున్నారు. మైనింగ్‌కు అనుమతులు ఇవ్వద్దంటూ అధికారులను గట్టిగా నిలదీసి నిలిపివేసిన నాయకులు, ప్రజాప్రతినిధులు మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో లేకపోవడంపై స్థానికులు విస్తుపోతున్నారు.



జూన్ నెలలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులతో వాదులాడుతున్న నాయకులు(ఫైల్)

మైనింగ్ ఎక్కడ నిర్వహిస్తారంటే..

పొదలకూరుకు సమీపంలోని 707 సర్వే నంబరులో క్వార్ట్జ్ మైనింగ్ నిర్వహిస్తామని అనుమతులు పొందిన ప్రాంతం నుంచి 200 మీటర్ల దూరంలో ప్రభుత్వ లేఅవుట్లు ఉన్నాయి. ఇక్కడ ఇళ్లు నిర్మించుకోవాలంటే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయంటున్నారు. అంతేకాక సమీపంలో తెలుగుగంగ పునరావాస కేంద్రం(తోకంచి), మర్రిపల్లి, చిట్టేపల్లి, లింగంపల్లి గ్రామాలు, ఐటీఐ కాలేజీ ఉన్నాయి. దీనికితోడు చుట్టుపక్కల గ్రామాల పాడిరైతులు పశువులు, మేకలు, గొర్రెలను మేపుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతాయంటున్నారు.

పోలీస్ బందోబస్తు మధ్య అభిప్రాయ సేకరణ

నెల్లూరు ఆర్డీఓ మలోల జూన్ 26న భాస్కరయ్యకు చెందిన 707 సర్వే నంబరులో 2.574 హెక్టార్ల విస్తీర్ణంలో ఎన్విరాన్‌మెంట్ అధికారుల సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించగా రసాభాసగా మారింది. అన్ని పార్టీలు, వర్గాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు ఇక్కడ మైనింగ్ వద్దని అధికారులను అడ్డుకుని గందరగోళం సృష్టించారు. కొందరైతే అక్కడే ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అయితే మంగళవారం నిర్వహించిన అభిప్రాయ సేకరణలో గతంలో ఆందోళన చేసిన వారౌ గైర్హాజరయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, చిట్టేపల్లి, మర్రిపల్లి, తోకంచి, లింగంపల్లి గ్రామాలకు చెందిన కొందరు అడ్డుకోవాలని ప్రయత్నించినా పోలీసులు నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని బెదిరించడంతో భయపడి వెళ్లిపోయారు. దీనివెనుక ఏమి జరిగిందనేది స్థానికులకు అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయింది. అంతేకాక మైనింగ్ అనుమతులకు సహకరించింది ఎవరు? ప్రజాభిప్రాయ సేకరణకు అడ్డంకులు తొలగించింది ఎవరనే దానిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

అనుమతులు రద్దు చేయాలి



మా కాలనీకి సమీపంలో తెల్లరాయి మైనింగ్ చేయడం వల్ల పశువుల మేతకు ఇబ్బందిగా మారుతుంది. వారు బ్లాస్టింగ్ చేస్తే మా ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. మేము వద్దని ఎంతగా చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. లారీలు మా కాలనీ మీదుగా వెళితే రోడ్లు దెబ్బతినడంతో పాటు పిల్లలకు ప్రమాదం జరుగుతుంది.

– రేగుంట పెదపెంచలయ్య, పునరావాస ఎస్సీ కాలనీ (తోకంచి)

అడ్డుకున్నా ఫలితం లేదు



ప్రజల శ్రేయస్సు కోసం తాము మైనింగ్‌ను అడ్డుకోవాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోతోంది. మైనింగ్ నిర్వాహకులు ఏకపక్షంగా ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. దీనిపై తాము పోరాటం చేస్తాం. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదు.

– జి.శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు, పొదలకూరు బిట్–4

మా గోడు వినిపించుకోలేదు



మైనింగ్‌కు సమీపంలోనే తెలుగుగంగ పునరావాస కేంద్రం(తోకంచి) ఉంటే మేము అభిప్రాయాన్ని వెల్లడించేందుకు వెళితే అధికారులు పరిగణలోకి తీసుకోలేదు. మైనింగ్ యజమానులు వారి మనుషుల ద్వారా వాగ్వాదానికి దిగారు. పోలీసులు వచ్చి చెదరగొట్టి మమ్మల్ని బెదిరించడంతో కేసులు పెడతారని వెనుతిరగాల్సి వచ్చింది. మైనింగ్ వల్ల మాకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయి.

– సీహెచ్ వెంకటేశ్వర్లు, తెలుగుగంగ పునరావాస కేంద్రం(తోకంచి).

వైఎస్సార్‌సీపీ నాయకుడి టీ బంకు దహనం

• ఎవరో కావాలనే నిప్పంటించారని బాధితుల అనుమానం


పూర్తిగా దగ్ధమైన దుకాణం

కందుకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మునగాల కృష్ణారెడ్డికి చెందిన టీ దుకాణం అకస్మాత్తుగా అగ్నికి ఆహుతైన ఘటన బుధవారం అర్ధరాత్రి కందుకూరు పట్టణంలోని అంకమ్మతల్లి దేవాలయం సమీపంలో చోటు చేసుకుంది. బాధితుడు కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేట్ స్థలాన్ని లీజుకు తీసుకుని టీ అండ్ స్నాక్స్ దుకాణం నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల వరకు దుకాణం నిర్వహించి, అనంతరం ఇంటికి వెళ్లాడు. అయితే రాత్రి 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా దుకాణంలో మంటలు చెలరేగడంతో పక్క ఇంటి వారు గమనించి కృష్ణారెడ్డికి సమాచారమిచ్చారు. ఆయన దుకాణం వద్దకు చేరుకునే సరికే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించి దుకాణం అంతా అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గురువారం ఉదయం డీఎస్పీ శ్రీనివాస్, సీఐ నఫీజ్‌బాష, ఎస్‌ఐ ఆనంద భాస్కర్ కాలిపోయిన దుకాణాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదంలో దుకాణంలో ఉన్న ఫ్రిజ్‌లు, కూల్‌డ్రింక్ బాటిళ్లు, ఇతర వస్తువులన్నీ కాలిపోవడంతో దాదాపు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరో కావాలనే పెట్రోల్ పోసి నిప్పు అంటించారని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా కక్షిదారుడు **శ్రీ సన్నారెడ్డి నందగోపాల్ రెడ్డి** S/o కోదండరామిరెడ్డి, మనుబోలు మండలం, కట్టువపల్లి గ్రామ కాపురస్థుడు క్రింద కనపరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని **అవ్వారు శ్రీరాములు** S/o రామబద్రయ్య గారి వద్ద నుండి **తే.01-06-2008 దిన రూ. 80,00,000.00 లు** అడ్వాన్సు చెల్లించి మిగిలిన మొత్తమును **రిజిస్టర్ పత్రము** పొందులోపు అనగా **3 నెలల కాల పరిమితిలో** చెల్లించి **విక్రయ పత్రమును** పొందవలెనని అంగీకారముతో పై **విక్రయ అగ్రిమెంటు** వ్రాయుట జరిగినది. కానీ కొన్ని చట్టబద్ధమైన సమస్యల వల్ల పై పేర్కొన్న **శ్రీరాములు విక్రయపత్రము** వ్రాయుట జరగలేదు. **శ్రీరాములు** గతించిన పిమ్మట వారి భార్య, పిల్లలు మా కక్షిదారునికి వ్రాసి యిచ్చిన **అగ్రిమెంటు** విషయము తెలిసి కూడా దానిని అమలుపరచకనే **వేటూరు మధుసూదనరెడ్డి** S/o శ్రీనివాసులురెడ్డి, విద్యానగర్, **ప్రొప్రయిటర్ ఫ్రెండ్లీ ఆక్వా ఫీడ్స్ & సీడ్స్** అను వారితో కుమ్మక్కై వారు తీసుకున్న ఋణమునకు, సిండికేట్ బ్యాంకు, నెల్లూరు వారికి సెక్యూరిటీగా క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని చూపడం జరిగినది. తదుపరి వారిరువురు షెడ్యూలు దాఖలా ఆస్తిని మార్పు చేసుకోవడం ద్వారా జరిగినది. మా కక్షిదారుడు **3వ అదనపు జిల్లా కోర్టు నెల్లూరులో** పై వారిపై మరియు తిరిగి ఋణము యిచ్చిన ICICI బ్యాంకు పైన **O.S.No.82/2019** అను దావా దాఖలు చేసియున్నారు. మా కక్షిదారుడు వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవలెనని **5th ADM కోర్టు నెల్లూరులో** వేసిన పిటిషన్‌పై విచారణ జరపవలెనని నెల్లూరు **5వ పట్టణ పోలీస్ వారికి** ఆదేశము యివ్వడం జరిగింది. ఇంతలో ICICI బ్యాంకు వారు షెడ్యూలు దాఖలా ఆస్తిని **ఈ-ఆక్షన్** ద్వారా అమ్మజూపినారు. కావున పై పేర్కొన్న విషయములు స్పష్టముగా పై కోర్టులో వివాదములు వున్నవని తెలియజేయడమైనది. కావున వుత్తరోత్తర ఎవ్వరైనను షెడ్యూలు ఆస్తి కొనుగోలు చేసినను చట్టరీత్యా మా కక్షిదారునికి పొందే హక్కులుకు లోబడివుండునని పూర్తి హక్కులు రావని తెలియజేయడమైనది.

SCHEDULE

ALL THAT PIECE AND PARCEL of Plot bearing number B-9 of A.P. Industrial Estate, Nellore. Measuring East to West (151.3 + 152)/2, North to South (126.6+119.6)/2, **total measuring 18652.95 Sq. ft** equivalent to 259 Ankanams vacant site in which RCC roofed office building and Asbestos roofed shed electrical service connection, Electrical fittings, fixtures and furnitures and the same in bounded:-

East by : G.N.T. Road
West by : Plot No. B-10
North by : Plot No. B-8
South by : Road.

ఇట్లు : **P.V.సాయికుమార్ రెడ్డి,** B.A., B.L.,
కక్షిదారు తరఫు న్యాయవాది, గూడూరు.

అమాత్యా.. ఆలకించుమా..

వైద్యశాలల్లో రోగులకు అవస్థలు

• జీజీహెచ్‌లో నెలలో 15 రోజులు కూడా పనిచేయని ప్రభుత్వ డయాలిసిస్ కేంద్రం
• వృథాగా పడి ఉన్న సీవేజ్ ప్లాంట్
• ఎంఆర్‌ఐ స్కాన్ చేస్తే రిపోర్టు ఇవ్వరా..?
• నేడు మంత్రి సత్యకుమార్ జీజీహెచ్‌కు రాక

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసి ప్రజారోగ్యమే ధ్యేయంగా ముందుకుసాగింది. డాక్టర్లు, నర్సులు, ఇతర సహాయకుల పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేసింది. రోగులకు అవసరమైన అన్ని రకాల పరికరాలు, మందులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి తెచ్చింది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వంలో అందుకు భిన్నంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోని సమస్యలతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ తాము వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతుండడం గమనార్హం.


నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏసీ పనిచేయని ఐసీయూ


వీల్‌చైర్ దొరక్క రోగిని అతి కష్టమ్మీద నడిపించుకుని పోతున్న మహిళలు

నెల్లూరు(అర్బన్): జిల్లాకే రెఫరల్ ఆస్పత్రిగా ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో సమస్యలు తిష్ట వేశాయి. పెద్దాస్పత్రిలో 750 పడకలు ఉన్నాయి. పలు రకాల విభాగాలు ఉన్నాయి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోగులకు అనేక రకాల వైద్యసేవలు సకాలంలో అందడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తరఫున శుక్రవారం తొలిసారిగా నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)కి రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ రానున్నారు. సమస్యలపై డాక్టర్లతో సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖలోని సమస్యలను పరిష్కరించాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రోగులు మంత్రిని కోరుతున్నారు.

సమస్యలివిగో..

➡ పెద్దాస్పత్రిలోని మురుగునీరు బయటకు పోయేందుకు మార్గాలు సరిగా లేక తరచూ పొంగుతోంది. ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో సుమారు 450 మ్యాన్ హోల్స్ ఉన్నాయి. ఇవి అనేక చోట్ల పగిలిపోయి మరమ్మతులకు గురయ్యాయి. వీటికి మరమ్మతులు చేయించి శానిటేషన్ విభాగానికి మెయిన్‌టెనెన్స్‌కు అప్పగించాలి. అలా జరగలేదు.

➡ మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంట్(సీవేజ్ ప్లాంట్)ను నిర్మించి ఏళ్లు గడుస్తున్నా దానిని వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. వైద్యానికి వచ్చిన తమకు కొత్త జబ్బులు అంటుకుంటున్నాయని రోగులు వాపోతున్నారు.

అడుగడుగునా సమస్యలే..

➡ నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు అత్యాధునిక ఎంఆర్‌ఐ, సీటీ స్కానింగ్ లాంటి పరీక్షలు చేస్తున్నారు. కేవలం ఫిలింలు మాత్రమే ఇస్తున్నారు. రేడియాలజిస్ట్‌ల కొరత వల్ల రిపోర్టు ఇవ్వలేమని టెక్నీషియన్లు తెగేసి చెబుతున్నారు. దీంతో రోగులు స్కానింగ్ వివరాలను సీడీలో వేయించుకుని బయట ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌లకు వెళ్లి డబ్బులు చెల్లించి రిపోర్టులు తెచ్చుకుంటున్నారు. సిఫార్సులతో ఎవరికైనా రిపోర్టులు ఇచ్చినా మూడు.. నాలుగు రోజులు పడుతోంది. ఈ లోపు రోగికి జరగరానిది ఏమైనా జరిగితే జవాబు చెప్పే దిక్కులేదు.

➡ పెద్దాస్పత్రిలో నెఫ్రోప్లస్ అనే ప్రైవేట్ సంస్థ డయాలిసిస్ కేంద్రాన్ని పీపీపీ పద్ధతిలో 15 బెడ్లతో నడుపుతోంది. అక్కడ రోగులు ఫుల్లుగా ఉంటారు. అయితే ప్రభుత్వ(జీజీహెచ్) ఆధ్వర్యంలో 4 బెడ్లతో నడిచే డయాలిసిస్ కేంద్రం మరొకటి ఉంది. రెండు బెడ్లతో ఐపీ బిల్డింగ్‌లోని మొదటి అంతస్తులో ఒక సెంటర్‌ను నిర్వహిస్తుండగా, మరో రెండు బెడ్లను నెఫ్రోప్లస్ వారి వద్దనే ఉంచారు. ఐపీ బిల్డింగ్‌లో ఉండే డయాలిసిస్ కేంద్రం నెలలో 15 రోజులు మూసేసి ఉంటారు. అప్పుడప్పుడు రోజుకు ఒకటి లేదా రెండు కేసులకు మాత్రమే డయాలిసిస్ చేస్తారు. అక్కడ ముగ్గురు టెక్నీషియన్లు, ఒక స్టాఫ్ నర్సు, ఒక శానిటరీ సిబ్బంది ఉన్నారు. వీరందరినీ ఖాళీగా కూర్చోబెట్టి జీతాలు ఇస్తుండడం గమనార్హం.

➡ పెద్దాస్పత్రిలో రాత్రి పూట క్యాజువాలిటీ(ఎమెర్జెన్సీ)కి వచ్చిన రోగులను గంటల తరబడి చేర్చుకోకుండా ఆలస్యం చేస్తుండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

➡ కొన్ని రకాల రక్తపరీక్షలను బయట చేయించుకోవాలని చెబుతున్నారు.

➡ ఐపీ భవనంలోని ఒక ఐసీయూలో ఏసీలు పని చేస్తుండగా మరో ఐసీయూలో ఏసీలు లేక ఎమెర్జెన్సీ రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

➡ 60కి పైగా ఏసీ, గీజర్ లాంటి వసతులు కలిగిన పెయిడ్ రూంలు ఉన్నా వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. అవి నిరుపయోగంగా ఉన్నాయి.

➡ అవసరమైనన్ని వీల్‌చైర్లు, స్ట్రెచర్లు లేవు. ఉన్న వీల్‌చైర్లలో కూడా రోగులను వారి సహాయకులే నెట్టుకుంటూ పోతున్నారు.

➡ జీజీహెచ్‌లో కుక్కలు, పందులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి.

డాక్టర్లు దుమ్మా..

పెద్దాస్పత్రిలో కొంతమంది డాక్టర్లు నిజాయితీగా పనిచేస్తుండగా.. మరికొంతమంది ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు వేసుకుని దుమ్మా కొడుతున్నారు. డాక్టర్లు ఉదయం 10 గంటలకు ఆస్పత్రికి వచ్చి.. మధ్యాహ్నం 12.30 గంటలకే వెళ్లిపోతున్నారు. దీంతో జూనియర్ డాక్టర్లపై భారం పడుతోంది. కొంతమంది సీనియర్ డాక్టర్లు రక్తపరీక్షలు రాస్తారు. రిపోర్టులు వచ్చేలోపు అందుబాటులో ఉండడం లేదని రోగులు వాపోతున్నారు.

ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలో..

➡ పుట్టబోయే బిడ్డ అవయవలోపాల(అంగవైకల్యం) గురించి ముందుగా తెలుసుకునేందుకు టిఫా స్కానింగ్ ఎంతో అవసరం. ఆత్మకూరు, ఉదయగిరి, బద్వేలు, వింజమూరు, సంగం, చేజర్ల, కలువాయి, అనంతసాగరం, మర్రిపాడు తదితర ప్రాంతాల గర్భిణులకు ఎంతో ఉపయోగపడే టిఫా స్కానింగ్‌ను ఆత్మకూరులోని జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

➡ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిని 100 నుంచి 150 పడకలకు అప్‌గ్రేడ్ చేసి కొన్ని రకాల అదనపు సౌకర్యాలు కల్పించింది. అందులో భాగంగా అదనంగా పలు వైద్య పరికరాలు వైద్యశాఖ నుంచి వస్తున్నాయి. వాటిని ఏర్పాటు చేసేందుకు గదులు లేక డాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వైద్యశాఖలో ఇలాంటి సమస్యలు అనేకం రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పందించి రోగులకు సౌకర్యాలతోపాటు, నాణ్యమైన వైద్యం అందించేలా, కబ్జా స్థలాలకు విముక్తి కలిగేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యశాఖ ఆస్తుల కబ్జా

నెల్లూరులోని పాత మున్సిపల్ ఆఫీసు ఎదురుగా వైద్యశాఖకు చెందిన పీఓడీటీ కార్యాలయం ఉంది. దానిని కొంతమంది వ్యక్తులు దర్జాగా కబ్జా చేశారు. రోడ్డు వైపునకు దుకాణాలు కట్టుకుని ఒకరు జిరాక్స్ షాపు, మరొకరు పండ్లషాపు, టిఫిన్ అంగడి నిర్వహిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. మరొకరు ఏకంగా పీఓడీటీ కార్యాలయాన్ని తన నివాసంగా వినియోగించుకుంటున్నారు. దీనికి విద్యుత్ బిల్లు చెల్లించేది కూడా వైద్యశాఖనే కావడం గమనార్హం. కోట్లాది రూపాయల విలువైన స్థలాలు కబ్జా అవుతున్నా వైద్యశాఖ పట్టించుకోలేదు.


వార్డులో యథేచ్ఛగా తిరుగుతున్న కుక్కలు

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.40



సూరా నుంచి రక్షణ కల్పించండి

• రూరల్ డీఎస్పీకి పంచేడు గిరిజనుల ఫిర్యాదు


బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: తమ తండ్రి నాగయ్యను టీడీపీ నేత సూరా శ్రీనివాసులురెడ్డి నుంచి కాపాడాలని కుమారుడు శ్రీనివాసులు, కుమార్తెలు రమ, హైమ, కుసుమ వేడుకుంటున్నారు. వివరాలు.. రెండు రోజుల క్రితం బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గిరిజనకాలనీకి చెందిన నాగయ్యను సూరా శ్రీనివాసులురెడ్డి తన మనుషులతో కొట్టించి, పోలీసులతో చిత్రహింసలకు గురిచేయించాడు. మనస్తాపానికి గురైన నాగయ్య పురుగుమందు తాగి నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై గురువారం నాగయ్య కుమారుడు, కుమార్తెలు కాలనీవాసులతో కలిసి నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. తమ తండ్రిని కాపాడాలని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలో పొదుపు, పింఛన్ నగదు లాగేసుకున్న సూరాను ప్రశ్నించినందుకు తమ తండ్రిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. తమ తండ్రిపై దాడి చేయించిన వారిపై కేసు పెట్టేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే పోలీసులు కేసు నమోదు చేయకుండా సూరా చెప్పినట్లు విని తమ తండ్రిని చితకబాదారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండ్రి ప్రస్తుతం ఐసీయూలో ప్రాణాల కోసం పోరాడుతున్నాడని, ఇంత జరుగుతున్నా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జోక్యం చేసుకోకపోవడం బాధాకరమని వారు వాపోయారు. తమ కుటుంబానికి సూరా నుంచి రక్షణ కల్పించాలని కోరారు. డీఎస్పీ శ్రీనివాసరావు స్పందిస్తూ శుక్రవారం తానే స్వయంగా బుచ్చిరెడ్డిపాళెం వచ్చి కేసును విచారిస్తానని తెలిపారు.

మహిళ కళ్లలో కారం చల్లి..

• కత్తితో దాడి చేసిన మరో మహిళ
• తీవ్ర రక్తగాయాలతో ఆస్పత్రిపాలు
• ఆత్మకూరు పట్టణంలో ఘటన


ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న సీఐ జి వేణు, ఎస్సై కె ముత్యాలరావులు


తీవ్రంగా గాయపడిన గాయత్రి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని జేఆర్‌పేట సహస్ర అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఓ మహిళపై పక్క పోర్షన్‌లో ఉన్న మరో మహిళ కళ్లలో కారం చల్లి కత్తితో దాడికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ జి.వేణు, ఎస్సై కె.ముత్యాలరావుల వివరాల మేరకు... అపార్ట్‌మెంట్‌లోని ఒక ఫ్లాట్‌లో సీతారామశాస్త్రి, గాయత్రి దంపతులు ఉంటుండగా పక్క పోర్షన్‌లో వెంకటేశ్వరరెడ్డి, రాజేశ్వరి దంపతులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో గాయత్రి బట్టలు ఆరేస్తున్న క్రమంలో రాజేశ్వరి ఒక్కసారిగా వచ్చి ఆమె కళ్లల్లో కారం చల్లి, జుట్టు పట్టుకొని వంచి కూరగాయలు తరిగే కత్తితో భుజాలు, వీపుపై పలుమార్లు పొడిచింది. దీంతో గాయత్రి కేకలు వేయడంతో సమీపంలోని వారు వచ్చి రాజేశ్వరి పట్టు నుంచి గాయత్రిని విడదీశారు. తీవ్ర గాయాలై రక్తస్రావం జరుగుతుండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చి బాధితురాలిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన రాజేశ్వరి సైతం నిద్రమాత్రలు మింగేందుకు ప్రయత్నించారు. పక్కనే ఉన్నవారు వారించడం, కొద్దిసేపటికే పోలీసులు రావడంతో ఆమెను అదుపులోకి తీసుకొని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన గాయత్రిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పోలీసులు వెళ్లి విచారణ చేశారు. రాజేశ్వరితో గాయత్రి భర్తకు అక్రమ సంబంధం ఉందన్న నేపథ్యంలో ఈ దాడి జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా తాను ఎప్పుడు కనిపించినా తిడుతూ ఉంటుందని అందుకే దాడికి పాల్పడినట్లు రాజేశ్వరి తెలపడం గమనార్హం. ప్రథమ చికిత్స అనంతరం రాజేశ్వరిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై వివరించారు.

ప్రభుత్వ బడుల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు

• 1,980 పాఠశాలల్లో ఏకగ్రీవం
• 604 స్కూళ్లలో ఎన్నికలు
• 27 చోట్ల ఎన్నిక వాయిదా

నెల్లూరు(టౌన్): పాఠశాలల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను నిర్వహించింది. జిల్లాలో మొత్తం 2,622 పాఠశాలలకు స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు నిర్వహించారు. వీటిల్లో 2,611 పాఠశాలల్లో జరిగిన ఎన్నికలకు మాత్రమే వివరాలు అందాయి. వీటిల్లో 1,980 పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. జిల్లాలో 604 పాఠశాలల్లో అభ్యర్థులు పోటీలో నిలిచారు. మిగిలిన 27 పాఠశాలల్లో ఎన్నికలను వాయిదా వేశారు. వాయిదా వేసిన చోట్ల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయం తెలియలేదు. ఎన్నికలు వాయిదా పడిన పాఠశాలల్లో ఉలవపాడు మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, సైదాపురంలోని జెడ్పీహెచ్‌ఎస్, సైదాపురం మండలంలోని ఆర్ఆర్‌పురంలోని ఎంపీపీఎస్, మర్రిపాడు మండలం పల్లవోలులోని ఎంపీపీఎస్, లింగసముద్రం మండలం మొగిలిచర్లలోని ఎంపీపీఎస్, కొండాపురం మండలం నేకునంపేటలోని జెడ్పీహెచ్‌ఎస్, జలదంకి మండలం రాయవరప్పాడులోని ఎంపీపీఎస్, బోగోలు మండలం సిద్దవరంలోని ఎంపీపీఎస్, ఆత్మకూరులోని జెడ్పీహెచ్‌ఎస్(గర్ల్స్), బట్టేపాడులోని జెడ్పీహెచ్‌ఎస్, అనంతసాగరం మండలం రేవూరు బీసీకాలనీలోని ఎంపీపీఎస్, దేవరాయపల్లిలోని ఎంపీపీఎస్ తదితర పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు విడవలూరు మండలం సీడీమిట్ట ఎంపీపీఎస్, గుడ్లూరు మండలం తెట్టులోని ఉర్దూ స్కూల్, కోవూరు మండలం కట్టకిందపాళెంలోని ఎంపీపీఎస్‌ల్లో ఎన్‌రోల్‌మెంట్ లేని కారణంగా ఎన్నికలు నిర్వహించలేదు. కాగా ఈ స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో పలువురు రాజకీయ నాయకులు జోక్యం చేసుకున్నట్లు పలువురు చెబుతున్నారు. జిల్లాలోని కొన్ని స్కూళ్లలో అవతలి వైపు పోటీ లేకుండా బెదిరించి ఏకగ్రీవాలు చేసుకున్నట్లు తెలిసింది.

స్వర్ణభారత్‌కు చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతి

వెంకటాచలం: మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గురువారం సాయంత్రం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో శుక్రవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు జరిగే వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకున్న ఆయనకు పలువురు అధికారులు ఘన స్వాగతం పలికారు.

కూలీలుగా మారిన విద్యార్థులు


ఉలవపాడు జూనియర్ కళాశాలలో పనులు చేస్తున్న విద్యార్థులు

ఉలవపాడు: చదువు కోసం తల్లిదండ్రులు తమ బిడ్డలను కళాశాలకు పంపిస్తే అక్కడ అధ్యాపకులు వారితో బేల్దారి పనులు చేయిస్తున్నారు. ఈ ఘటన ఉలవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగింది. ప్రస్తుతం కళాశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బయట నుంచి కూలీలు వచ్చి ఈ పనులు చేయాల్సిఉంది. కానీ కళాశాల ప్రిన్సిపల్ గోపీచంద్ విద్యార్థులతో చేయిస్తున్నారు. క్లాసుల్లో పాఠాలు వినాల్సిన సమయంలో తమ పిల్లలతో ఇలా పనులు చేయిస్తే వారికి చదువు ఎలా వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది అధ్యాపకులు తమ పిల్లలతో పనులు చేయించుకోవడం, వారికి భోజనాలు, టిఫిన్‌లు తెప్పించుకోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో సర్దుబాటు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 2,592 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,021 ప్రాథమిక, 238 ప్రాథమికోన్నత, 283 ఉన్నత, 50 హైస్కూల్ ప్లస్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 1.81 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. గత విద్యా సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 580 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసింది. వీరి డిప్యుటేషన్ ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగిసింది. దీంతో ఉపాధ్యాయుల సర్దుబాటుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ప్రక్రియ శుక్రవారం నుంచి మొదలై ఈ నెల 11వ తేదీకల్లా పూర్తి చేయాలని ఆదేశాలు అందాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ B.Sc. ఫోరెన్సిక్ సైన్స్. అర్హత : ఇంటర్ Bi.PC/MPC; B.Sc.అగ్రికల్చర్. అర్హత : Bi.PC/ అగ్రికల్చర్ డిప్లమో. ICAR సిలబస్;BBA- అర్హత : ఇంటర్ Any గ్రూప్. స్టెల్లా ఉమెన్స్ కాలేజ్, విజయవాడ. ఫోన్ : 74166 98395. [V- 2657]

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/lateral entry.9381287629 [T-2229]

REAL ESTATE

FLAT FOR SALE

■ RTC బస్టాండ్ దగ్గర, అరవిందనగర్, స్ప్రింగ్ నెస్ట్ అపార్ట్‌మెంట్‌లో 1650 చ॥అ॥ల, లాస్ట్ ఒక 3 BHK FLAT అమ్మకానికి కలదు. ఫోన్: 96770 10777 [V- 2645]

SERVICES

BUSINESS OFFER

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179 [DA-5872]

MARRIAGE SERVICES

■ వివిధ బ్యాంకులు/ తాకట్టు సంస్థలలో కుదువ/ వేలంలో ఉన్న బంగారాన్ని విడిపించి ఈ రోజు మార్కెట్‌ధరకి కొనబడును.గౌరవప్రదమైన సంస్థ. బెస్ట్ మనీ గోల్డ్. 91500 61325, 91500 11538. [NA-6553]

SECOND SALE

■ A to Z సెకండ్ హ్యాండ్ వస్తువులు మరియు గృహోపకరణాలు కొనబడును మరియు అమ్మబడును. వివరాలకు సంప్రదించండి: 8019193030, 9618310239, 8297783977. [NA-23601]

MARRIAGE SERVICES

■ క్రిస్టియన్ కన్వెర్టెడ్ BAPTIST, Age : 29, H:5'8". Govt. Job వరుడుకు తగిన Job వధువు కావలెను. బ్రీవర్. డైరెక్ట్ : 93933 71955. [N-1237175]

WANTED

■ Wanted Bank Field Verification Executives : Nellore Town, Muthukur, Field Experience : Courier, Zomato, Swiggy Services. Contact: 90598 92362, 79818 01911. [NA-6550]

■ Wanted Qualified Teachers for 1 to 5th Classes. Salary Between Rs. 13,000-Rs.15000. Contact: Silpa School, Revenue Colony, Nellore. Cell : 94419 01135. [NA-6547]

■ శ్రీ మ్యారేజ్ కన్సల్టెన్సీ నందు పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. Address : కొండాయపాళెం గేట్ ఎదురువీధి, నెల్లూరు. సెల్ : 88855 67277, 89850 48177. [NA-6552]

■ ప్రముఖ బంగారు సంస్థ నందు పని చేయుటకు సేల్స్ ఆఫీసర్స్, గోల్డ్ అప్రైజర్స్ & Diploma / BE విద్యార్హత కలిగిన మహిళలు కావలెను. 91500 61325, 91500 11538. [NA-6555]

■ JVR షాపింగ్ మాల్ నందు పని చేయుటకు క్యాషియర్స్-4 మరియు కస్టమర్స్‌ను రిసీవ్ చేసుకునేందుకులేడీస్ కావలెను.సంప్ర.JVRషాపింగ్ మాల్,కోమలవిలాస్‌దగ్గర,ట్రంకురోడ్డు, నెల్లూరు. [NA-682]

■ నివాసయోగ్యమైన ప్లాట్లు & ఇల్లులు అమ్ముటకు స్త్రీ/పు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. శాలరీ + కమీషన్ + అలవెన్స్ కలవు. వివరాలకు సంప్రదించండి. 80082 65019, 91824 40586. [NA-23602]

■ శ్రీ వెంకటేశ్వరా ఫైనాన్స్ నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ నెల్లూరు, కావలి, అల్లూరు, నరుకూరు నందు కావలెను. వివరములకు సంప్రదించండి: 97001 10061, 73866 40043. [NA-6551]

■ న్యూ శాంతి స్వీట్స్ & బేకరీ, చిల్డ్రన్స్ పార్క్ రోడ్, నెల్లూరు వారికి సేల్స్ మెన్స్ కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత.(ఫుల్‌టైం :10AM to10PM) (పార్ట్ టైం : 2PM to 10PM) సెల్: 99895 33077. [NA-6549]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 8247808801 [M-1185277]

■ ఒమేగా హోజర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపనికి / వంట పనికి వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662, 8977639663 [H-796188]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం, HYD. ఫోన్: 8317512135 [HA-98108]

■ లేడీ ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, నర్సులు మా హాస్పిటల్‌లో పని చేసేందుకు కావలెను. Contact: Dr. Andal Lakshmi Fertility Centre, Near S2 Cinema Hall, Pogathota, Nellore. Ph: 9908854316, 0861-2328914. [NA-2689]

■ సేల్స్‌మెన్, బిల్లింగ్ స్టాఫ్ : CMR జ్యూయలరీ విభాగంలో పని చేసేందుకు కావలెను. ఆకర్షణీయమైన జీతం. అనుభవం వున్నా / లేకున్నా వారు సంప్రదించగలరు.CMRషాపింగ్ మాల్, నెల్లూరు. సెల్ : 93921 93880. [NA-2691]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.